ప్రజాశక్తి
మంగళవారం 6 ఆగస్టు 2024 5
శ్రీ సత్యసాయి






కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తున్న స్కీం వర్కర్లు

తాగునీటి పథకాలను సంస్కరించేరా..?

కలెక్టర్ల సదస్సులో సత్యసాయి ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి ఆరా

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న తాగునీటి పథకాల నిర్వహణ అంతా అస్తవ్యస్తంగా మారింది. మరమ్మతులు నిర్వహణ కూడా ఇబ్బందికరంగా మారుతోంది. ఇక్కడ పనిచేసే సిబ్బందికీ వేతనాలకు కూడా సక్రమంగా అందని పరిస్థితి నెలకొంది. కొన్ని పథకాలు పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరుతుండంతో పునర్ నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది.



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 48 తాగునీటి పథకాలున్నాయి. ఇందులో ప్రధానమైనవి సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాలు ఈ రెండు ప్రాజెక్టులే సగానికిపైగా గ్రామాలకు నీటిని అందిస్తాయి. వీటికి సంబంధించి ఏడాదికి సగటున రూ.95.33 కోట్లు అవుతున్నాయి. ఇందులో రూ.33.02 కోట్లు, విద్యుత్ ఛార్జీల కింద రూ.62.37 కోట్లు నిధులు అవసరమవుతాయి. ఇవి సకాలంలో విడుదల కాకపోతుండటంతో కార్మికులకు ఐదారు నెలలుగా బకాయిలున్నాయి. అదేవిధంగా విద్యుత్ బకాయిలూ పేరుకుపోయి ఉన్నాయి. నిర్వహణకు మరమ్మతులకు నిధులు సకాలంలో విడుదల కాకపోతుండటంతో నీటి సరఫరాలోనూ తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రధానంగా సత్యసాయి తాగునీటి పథకం నిర్మాణం పూర్తయి 20 సంవత్సరాలవుతోంది. 1994లో ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. 20 ఏళ్ల పూర్తయిన నేపథ్యంలో అనేక చోట్ల పైపులైన్లు, ట్యాంకులు పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. వీటిని చాలా చోట్ల పునర్ నిర్మాణం చేట్టాల్సి ఉందని ఇంజినీర్లు చెబుతున్నారు.

నిర్వహణ పనులు విడగొట్టడంతో మరిన్ని సమస్యలు

ఇది వరకు సత్యసాయి ప్రాజెక్టు మొత్తాన్ని ఎల్అండ్టి సంస్థ చేపట్టేంది. శ్రీరామిరెడ్డి ప్రాజెక్టు మొత్తాన్ని ఒక్క కాంట్రాక్టరుకే అప్పగించేవారు. గడిచిన ప్రభుత్వ హయాంలో పథకం వారీగా నిర్వహణ పనులను విడగొట్టి పంపకాలు చేపట్టారు. ఈ పంపకాలతో కొన్ని చోట్ల నిర్వహణ ఇష్టానుసారంగా మారిందన్న ఆరోపణలున్నాయి. ప్రధానంగా కార్మికులకు సంబంధించి పిఎఫ్ చెల్లింపులు కూడా చేయకుండా కాంట్రాక్టర్లు బిల్లులు మాత్రం డ్రా చేసారన్న ఆరోపణలున్నాయి. ఈ విషయాన్ని జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ చర్చించడం గమనార్హం.



కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి ప్రస్తావన

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలోనూ సత్యసాయి ప్రాజెక్టు నిర్వహణ అవస్తవ్యస్తంగా మారిందని చెప్పారు. అంతేకాకుండా ఎల్అండ్టిని తప్పించారని, తిరిగి ఆ సంస్థకే నిర్వహణ బాధ్యతలు అప్పగించే ఆలోచనలోనున్నట్టు వెల్లడించారు. ఇతర ప్రాజెక్టుల నిర్వహణపై ఎటువంటి నిర్ణయం తీసుకుంటారన్నది చూడాల్సి ఉంది.

స్కీం వర్కర్ల తొలగింపులు ఆపండి

- అంగన్వాడీ కార్యకర్తను వేధించిన వారిని అరెస్టు చేయాలి
- స్పందించకుంటే ఎమ్మెల్యే సింధూర రెడ్డి ఇంటిని ముట్టడిస్తాం
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక స్కీం వర్కర్లు, చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు, తొలగింపులు ఎక్కువ అయ్యాయని, తక్షణం వీటిని ఆపేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి వర్కర్లు, మినీ వర్కర్లు మున్సిపాలిటీ యూనియన్, సత్యసాయి, శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా యూనియన్, ఆశా వర్కర్లు తదితర స్కీం వర్కర్లు ఆందోళన చేపట్టారు. సోమవారం ఉదయం ఆర్టీసీ డిపో నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ బైఠాయించి నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు జెడ్పీ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో ఓబులు మాట్లాడుతూ ఇటీవల ఓబుళదేవరచెరువు మండలం వీరప్పగారిపల్లికి చెందిన అంగన్వాడీ వర్కర్ నాగమణిపై ఆ గ్రామ టిడిపి నాయకుడు ఆంజనేయులు వేధింపులకు దిగారన్నారు. ప్రభుత్వం తమదని, వెంటనే రాజీనామా చేయాలని నాగమణిపై పదేపదే ఒత్తిడి తెచ్చారన్నారు. ఈ వేధింపులు తాళలేక ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిందన్నారు. సాటి మహిళకు అన్యాయం జరిగితే ఇక్కడ మహిళ ఎమ్మెల్యే సింధూర రెడ్డి కానీ, జిల్లా మంత్రి సవితమ్మ కానీ పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. బాధితులతో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి చర్చలకు పిలిచిన సమయంలో వేధింపులకు గురి చేసిన ఆంజనేయులు, వెంకటేష్ ఎదుటే మాట్లాడడం విచారకరం నిందితులను పక్కనబెట్టుకుని జరిపే చర్చల్లో తాము పాల్గొనమని ఆయనకు చెప్పి అక్కడి నుంచి వచ్చేశామన్నారు. ఇప్పటికీ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి జరిగిన సంఘటనను ఖండించలేదని, బాధితురాలినీ పరామర్శించలేదన్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అధికార పార్టీ నాయకులు ఇలాంటి వేధింపులకు గురి చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. బాధితురాలు నాగమణి మాట్లాడుతూ ఉద్యోగం నుంచి తప్పుకోవాలంటూ తనపై ఆంజనేయులు పదేపదే బెదిరింపులకు గురి చేయడంతోనే తాను ఆత్మహత్యకు యత్నించానని చెప్పారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఇంతియాజ్ మాట్లాడుతూ స్కీం వర్కర్లకు అండగా సిఐటియు పోరాటం చేస్తుందన్నారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టరేట్లో డిఆర్ఒ కొండయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంగన్వాడీ వర్కర్ల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.శ్రీదేవి, ఎస్.శ్రీదేవి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్, జిల్లా అధ్యక్షురాలు మాబున్నీసా, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జిఎల్.నరసింహులు, రైతుసంఘం నాయకుడు జంగాలపల్లి పెద్దన్న, మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు పైపల్లి గంగాధర్, పెడపల్లి బాబా, బ్యాళ్ల అంజి పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం : డిఆర్ఒ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వివిధ సమస్యలపై జిల్లాలోని దూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్కు వచ్చి అర్జీలు ఇచ్చే అర్జీదారుల సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవిన్యూ అధికారి కొండయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో ప్రజా సమస్యల వేదికలో 196 అర్జీలను ఆర్డీవో భాగ్యరేఖ, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ అర్జీదారుల విజ్ఞప్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. అర్జీదారుడు సంతప్తి చెందే విధంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరగనున్న సందర్భంగా ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమం, అభివద్ధి కార్యక్రమాల ప్రగతి నివేదికలను మంగళవారం సాయంత్రానికి సమగ్రంగా జిల్లా పౌర సంబంధాల అధికారికి అందజేయాలని ఆదేశించారు. జిల్లా మంత్రి ఆ వేడుకల్లో పాల్గొంటారని, ప్రతి అధికారి ఆయా ప్రగతిని వివరించే విధంగా నివేదికలు అందజేయాలని ఆదేశించారు. సాధించిన ప్రగతిని శకటాల ద్వారా తెలిపే విధంగా ఆగస్టు 15న ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



గోడపత్రిక విడుదల చేస్తున్న జాయింట్ కలెక్టర్

సార్వత్రిక విద్యాపీఠంకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూర విద్యా విధానంలో) 2024-25 సంవత్సరం పదవ తరగతి, ఇంటర్మీడియట్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలియజేశారు. సోమవారం నాడు కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రవేశాలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక విద్యాపీఠంలో ప్రవేశాలను 31-07-2024 నుంచి 27-08-2024వతేదీలోపు అపరాధ రుసుం లేకుండా పొందవచ్చున్నారు. రూ.200 రూపాయల అపరాధ రుసుంతో ఈ నెల 28వ తేదీ సెప్టంబర్ 4వ తేదీ వరకు పొందవచ్చున్నారు. 10వ తరగతిలో ప్రవేశానికి 14, ఇంటర్మీడియట్లో ప్రవేశానికి 15 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. ఈ విద్యావిధానంలో సెలవు దినాల్లో మాత్రమే తరగతులు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ స్టేట్ కోఆర్డినేటర్ రవీంద్రనాథ్, జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ లాజరు, సహాయ సంచాలకులు నాగరాజ పాల్గొన్నారు.

రక్తదానంకు ముందుకురావడం అభినందనీయం



బ్లడ్ బ్యాంక్ లో రక్తదానం చేస్తున్న రాధ

ప్రజాశక్తి-హిందూపురం

సాటి మహిళకు రక్తదానం చేసేందుకు ముందు కొచ్చిన రాధా త్యాగ గుణం అభినందనీయం అని అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ మానవతా రక్త దాన సంఘం అధ్యక్షులు ఉమర్ ఫరూక్ ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా ప్రభుత్వ అసుపత్రిలో సంధ్యబాయి అనే అనీమియా రోగికి అత్యవసరంగా ఏ పాజిటివ్ రక్తం అవసరం అయ్యింది. వీరు పట్టణంలోని అల్ హిందాద్ ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు అమన్ను సంప్రదించారు. ఈ సమయంలో రాధ అనే మహిళ తాను రక్తదానం చేస్తానని ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా రక్తదాత మాట్లాడుతు తాను రెండవ సారి రక్తదానం చేశానన్నారు. ఈ కార్యక్రమంలో రక్తదాన సంఘం సభ్యులు ఉసామా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అగళి

మండల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవరాం ఎమ్మెల్యే రాజు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు హాజరై వారి వారి శాఖల ప్రగతి, అభివృద్ధి గురించి చదివి వినిపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సర్పంచి, ఎంపిటిసి రాజకీయ పార్టీలను పక్కనపెట్టి ప్రజలకు అందుబాటులో ఉంటూ మీ గ్రామాల్లో అభివృద్ధిపై దృష్టి సాదించాలన్నారు. ప్రతి వారం మండలంలో సమావేశం ఏర్పాటు చేసుకొని ఆయా పంచాయతీల్లోని సమస్యల పై చర్చించి పరిష్కరించాలన్నారు. మీ పరిధిలో లేని సమస్యలను నా దృష్టికి తెస్తే పరిష్కారానికి చొరవ చూపుతానన్నారు. నియోజకవర్గంలోని 5 మండలాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రూ. 56 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించే దిశగా అధికారులు పనిచేయాలన్నారు. ఇంటి నిర్మాణానికి రూ. 4 లక్షల చొప్పున ఇస్తున్నామని అర్హుల జాబితా తయారు చేయాలని హౌసింగ్ అధికారిని ఆదేశిం చారు. రైతులకు ఇన్పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, తదితర ప్రయోజనాలను నేరుగా అందించాలన్నారు. రైతులకు వ్యవసాయ అధికారి అందుబాటులో ఉండాలన్నారు. కౌలు రైతులకూ ప్రభుత్వం పథకాలు అందించేలా చూడాలని ఆదేశించారు. ఉపాధి హామీ ద్వారా పండ్లతోటలు, పాడిపశువులు, గేదెలు, గొర్రెలు, కోళ్ల పెంపకానికి 70 శాతం సబ్సిడీతో అందిస్తున్న విషయాన్ని అధికా రులు వివరించాలన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహా లకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి టిడిపి కార్యకర్తలతో కలిసి ఎంపీడీవో కార్యాలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. సమావేశంలో ఎంపీపీ రేణుక కామరాజు, జడ్పిటిసి ఉమేష్, వ్యవసాయ అధికారి భూషణ్ నాయక్, ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ సుబ్బారావు, అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

జీవో 117ను రద్దు చేయాలి : యుటిఎఫ్



వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 117ను తక్షణం రద్దు చేయాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మండల విద్యాశాఖ అధికారి-1 లలితమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన అసంబద్ధ సంస్కరణల ఫలితంగా రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులు విద్యకు దూరం చేసే విధంగా గత ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయన్నారు. కొత్త ప్రభుత్వం వీటిపై దృష్టి సారించి విద్యా వ్యవస్థను పటిష్టం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జీవో నెంబర్ 117ను రద్దుచేసి జీవో ఎంఎస్ నెంబర్ 53 తేదీ 23.10.2020 ప్రకారం టీచర్లను కేటాయించాలన్నారు. ప్రీ ప్రైమరీతోపాటు ఒకటి నుంచి ఐదు తరగతులు ఒకే పాఠశాలగా నడపాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలన్నారు. హై స్కూళ్లలో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలని కోరారు. ఉపాధ్యాయులను బోధ నేతర పనుల నుంచి మినహాయించి, పని భారం తగ్గించాలన్నారు. వీటితో పాటు ఉపాధ్యాయ, ప్రభుత్వ విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమం యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు తహీర్ వలీ, తనకల్లు మండలం నాయకులు సుండుపల్లి గణేష్, ఖాజా మోహియుద్దీన్, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొన్న పాడి రైతులు

పాల సేకరణలో ప్రస్తుత విధానమే కొనసాగించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మహిళా సహకార సంఘాల ద్వారా అమూల్ కంపెనీ పాడి రైతుల ద్వారా సేకరిస్తున్న ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అడపాల వేమనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో పాడి రైతులు సహకార సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా వేలాది మంది పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో అమూల్ కంపెనీ పాల ఉత్పత్తులు పెంచడానికి రైతులు సంఘాల ద్వారా బ్యాంకుల్లో రుణాలు పొందారన్నారు. ఈ నేపథ్యంలో అమూల్ కంపెనీ పాల సేకరణ నిలిపి వేస్తోందని వార్తలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇదే అదునుగా కొన్ని ప్రయివేటు సంస్థలు ముందుకొచ్చి పాల పదార్థాలను తగ్గించి రైతులకు నష్టం కలిగించే అవకాశం ఉందని, పాత పద్ధతినే కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్ఒ కొండయ్యకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి సహదేవ్, పలువురు సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో అర్జీల స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ విష్ణు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో సోమవారం నాడు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అర్జీలను స్వీకరించారు. జిల్లా అదనపు ఎస్పీ ఎన్.విష్ణు ఆధ్వర్యంలో "మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 40 అర్జీలను అదనపు ఎస్పీ నేరుగా స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు పంపించి చట్టపరంగా ఉన్న సమస్యలను సకాలంలో పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్క పోలీస్ స్టేషన్లో బాధితులు ఇచ్చిన ఫిర్యాదులు పెండింగ్ పెట్టకుండా తక్షణమే పరిష్కరించాలని సూచించారు. మహిళా సమస్యలు, ఎస్సీ ఎస్టీ, వికలాంగులు, వద్ధులు ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, డిసిఆర్బి, సిఐ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచితవిద్య

ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూ పురం పట్టణంలో ఉన్న ప్రయివేటు విద్యా సంస్థల్లో అక్రిడేషన్ కలిగిన ప్రతి జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్యను అందిస్తామని ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు తెలియజేశారు. హిందూపురం ప్రెస్క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నాడు అక్రిడేషన్ జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్యను అందించాలని పాంచజన్య పాఠశాలలో అసోసియేషన్ అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత విద్యను అందించాలని ఆదేశాలను జారీ చేసినప్పటికి కొన్ని విద్యా సంస్థల నిర్వహకులు అమలు చేయడం లేదన్నారు. అన్ని పాఠశాలల్లో ఉత్తర్వులను అమలు చేసి, జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన శ్రీనివాసులు త్వరలో అసోసియేషన్ సమావేశం ఏర్పాటు చేసుకుని, అన్ని పాఠశాలల్లో ఉచిత విధ్యను అందించే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్క్లబ్ అధ్యక్షులు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ కుమార్, ముఖ్య కార్యనిర్వాహక అధ్యక్షులు షబ్బీర్, ఉపాధ్యక్షులు అల్లిపీరా, సహాయ కార్యదర్శి చరణ్, జర్నలిస్టులు అంజనమూర్తి, శివకుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.



పాంచజన్య శ్రీనివాసులుకు వినతిని అందిస్తున్న ప్రెస్క్లబ్ కమిటీ ప్రతినిధులు

వేధింపులు ఆపకుంటే ఆందోళనలు

ప్రజాశక్తి-హిందూపురం

కూటమి ప్రభుత్వం స్కీం వర్కర్లపై చేస్తున్న వేధింపులు, తొలగింపులు ఆపకుంటే ఆందోళనలు చేపడతామని సిఐటియు పట్టణ నాయకులు రాము తెలిపారు. సోమవారం నాడు శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన స్కీం వర్కర్ల ఆందోళన కార్యక్రమంలో పాల్గొనేందుకు హిందూపురం నుంచి పెద్ద ఎత్తున స్కీం వర్కర్లు వెళ్లారు. ఈసందర్భంగా రాము మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడవ ముందే స్కీం వర్కర్లపై వేధింపులు, దాడులు, తొలగింపులకు పాల్పడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల ముందు స్కీం వర్కర్లకు అండగా ఉంటామని చెప్పిన టిడిపి నాయకులు అధిరాకంలోకి రాగానే వారిని తొలగించేలా వేధింపులకు పాల్పడడం సరికాదన్నారు. వేధింపులు, తొలగింపుల విషయంలో ప్రభుత్వం తన తీరును మార్చుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్ట్ కార్యదర్శి లావణ్య, సెక్టర్ లీడర్స్ శిరీష, పద్మక్క, భారతి, సునీత, మీనా, మున్సిపల్ యూనియన్ నాయకులు అధ్యక్షులు మల్లికార్జున, ఉపాధ్యక్షులు గుర్నాథం, రామాంజనప్ప, నాగేంద్ర, బబాలాజీ, గంగ రత్నమ్మ, కవితమ్మ, మహేశ్వరమ్మ పాల్గొన్నారు.

అర్హులందరికీ చౌకధాన్యం : చిలకం

ప్రజాశక్తి-చిలమత్తూరు

కూటమి ప్రభుత్వంలో పేద బడుగు బలహీన వర్గాలు, అర్హులందరికీ చౌకధాన్యం అందించడమే ధ్యేయంగా పని చేయాలని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చికలం మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మండలంలోని పాతచామలపల్లి, కొత్తచామలపల్లి, చెరువు కిందపల్లిలో ప్రభుత్వ చౌక దుకాణాలను ప్రారంభించారు. హిందూపురం ఇన్‌ఛార్జి ఆకుల ఉమేష్ ఆధ్వర్యంలో చిలకం రేషన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమణ, మండల అధ్యక్షులు చిన్నా ప్రవీణ్, హిందూపురం పట్టణ అధ్యక్షులు కొల్లకుంట శేఖర్, మండల అధ్యక్షులు చక్రవర్తి పాల్గొన్నారు.

మడకశిర : చౌకదుకాణాల డీలర్లు కార్డుదారులకు సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని మాజీ సర్పంచి గుండుమల చంద్రప్ప సూచించారు. ఆయన మండలంలోని అమిదాల గొంది గ్రామంలో రేషన్ షాపును ప్రారంభించి కార్డుదారులకు బియ్యం పంపిణీ చేశారు.కార్డుదారులందరికీ న్యాయమైన పద్ధతిలో అందించాలని డీలర్ నరసింహమూర్తికి సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాయకులు భాస్కర్‌రెడ్డి, మంజునాథ్‌గౌడ్, కోట్ల రంగయ్యగౌడ్, ఎబి.మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ నూతన డీఎస్పీ బాధ్యతల స్వీకరణ

పెనుకొండ : పెనుకొండ డీఎస్పీగా ఆర్ల శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి నుంచి బదిలీపై వెళ్తున్న బాబిజాన్ సైదా నూతన డీఎస్పీకి బాధ్యతలు అప్పగించారు. నూతన డీఎస్పీ మాట్లాడుతూ పెనుకొండ ప్రాంతం తనకు కొత్తేమీ కాదన్నారు. 1997లో ఇక్కడ ఎస్ఐగా పని చేశానని, ఈ ప్రాంతం తనకు సుపరిచితమే అన్నారు. పేకాట, జూదం, తదితర అసాంఘిక కార్యక్రమా లపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలైనా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.



డీఎస్పీ శ్రీనివాసులు

నూతన తహశీల్దార్‌గా కె.శ్రీధర్

పెనుకొండ మండల నూతన తహశీ ల్దార్‌గా కె.శ్రీధర్ సోమవా రం బాధ్యతలు స్వీకరించా రు. ఈయన అన్నమయ్య జిల్లా నుంచి బదిలీపై ఇక్క డికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఉదయశంకర్ రాజు మూడు రోజుల క్రితమే రిలీవ్ అయ్యారు. నూతన తహశీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది పూల బొకేలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు.



తహశీల్దార్ శ్రీధర్‌కు పూల బొకే అందిస్తున్న సిబ్బంది

ఓడిసి తహశీల్దార్‌గా అనంతాచారి

ఓబుళదేవరచెరువు : మండల తహశీల్దార్‌గా సోమవారం అనంతాచారి బాధ్యతలు చేపట్టారు. గతంలో పని చేస్తున్న ఖాజాబీ బదిలీ కావడంతో కర్నూలు జిల్లా ఎల్లునూరులో పనిచేస్తున్న అనంతాచారి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి సిబ్బంది సహకారంతో ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.





అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

అవార్డు గ్రహీతలకు సన్మానం

గోరంట్ల : పత్రికా రంగంలో అవార్డు పొందిన ఈశ్వరయ్య, టూరిజం సంపాదకులు మైనాస్వామి, విశ్రాంత ఉపాధ్యాయుడు రామచంద్రారెడ్డిని సోమవారం పట్టణంలోని ఎస్పీవీఎం డిగ్రీ కళాశాలలో ఘనంగా సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ సమాజానికి విశిష్ట సేవలు అందించి అందరికీ స్ఫూర్తి దాయకంగా నిలిచిన వ్యక్తులను భావితరాలు స్ఫూర్తిగా తీసుకుని పట్టుదల, క్రమశిక్షణతో మెలిగి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మనోజ్, ప్రిన్సిపల్ భక్తవత్సలం, అధ్యాపకులు ఆజాద్, నందగోపాల్, అరవింద, కవిత, బాల మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

పత్తి రైతులకు పిచికారీ యంత్రాలు పంపిణీ

మడకశిర రూరల్ : మడకశిర నియోజకవర్గం పక్కన ఉన్న హొసకేర గ్రామంలో సోమవారం సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డి 150 మంది పత్తి రైతులకు నూజివీడు ప్రయివేట్ లిమిటెడ్ సౌజన్యంతో పిచికారి యంత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నూజివీడు ప్రయివేట్ లిమిటెడ్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు



పిచికారీ యంత్రాలు పంపిణీ చేస్తున్న రఘువీరా

క్వారీ సీజ్ చేయాలి

తనకల్లు : మండలంలోని దుగినేపల్లి సమీపంలో నిబంధనలు ఉల్లంఘించి నిర్వహిస్తున్న క్వారీని తక్షణమే సీజ్ చేయాలని కోరుతూ సోమవారం ఆ గ్రామానికి చెందిన జియావుల్లా తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దుగినేపల్లి సమీపంలో క్వారీ నిర్వహణకు అబ్దుల్ రహీంకు స్థానిక రెవెన్యూ కార్యాలయ అధికారులు నిబంధనలు ఉల్లంఘించి ఎన్ఒసి ఇచ్చారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి గ్రామస్తులు, రైతులకు ఇబ్బందిగా ఉన్న క్వారీని సీజ్ చేయాలని కోరారు.

8న పాఠశాలల కమిటీ ఛైర్మన్ ఎన్నిక

గాండ్లపెంట : మండల వ్యాప్తంగా ఈ నెల 8వ తేదీ పాఠశాలల కమిటీ ఛైర్మన్లను ఎంపిక చేయనున్నట్లు ఎంఇఒలు బి.కృష్ణనాయక్, శ్రీనివాసులు తెలిపారు. ఈ విషయంపై సోమవరాం స్థానిక ఎమ్మార్సీలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఇఒలు మాట్లాడుతూ మండలంలో కెజిబివి, 4 జడ్పీ, 4 యుపి, 49 ప్రాథమిక పాఠశాలల్లో ఈ నెల 8వ తేదీ పాఠశాల కమిటీ ఛైర్మన్ ఎన్నికలను ప్రతి హెచ్ఎం జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై ఛైర్మన్లు, ఉప ఛైర్మన్లను ఎన్నుకోవాలని హెచ్ఎంలకు తెలిపారు.

డయాలసిస్ బాధితుడికి ఆర్థికసాయం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని 40వ వార్డులో డయాలసిస్‌తో బాధపడుతున్న మెకానిక్ బాబుకు సోమవారం బిజెపి నాయకులు మిరియాల అంజి, హరీశ్, మల్లికార్జున రూ. 10వేలు అందజేశారు. అలాగే 27వ వార్డులో బద్రిప్రసాద్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న వారు మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5 వేలు అందజేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు అల్లం రామాంజనేయులు, హనుమంతు, శరత్ పాల్గొన్నారు.



డయాలసిస్ బాధితుడు బాబుకు ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

ధర్మవరంలో లేబర్ ఆఫీసు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరంలో లేబర్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డిఆర్ఒ కొండయ్యకు వినతి పత్రం అందజేశారు. సిఐటియు నాయకులు మాట్లాడుతూ గతంలో ధర్మవరంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసు ఉండేదని, పుట్టపర్తి జిల్లా ఏర్పడిన తర్వాత కొత్తచెరువుకు మార్చారన్నారు. దీంతో ఈ ప్రాంతంలోని భవన నిర్మాణ, ఆటో, వెల్డింగ్, దుస్తులు, సిల్క్ హౌస్ కార్మికులు, తదితర అసంఘటిత రంగ కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ధర్మవరంలో 20వేల మంది అసంఘటిత కార్మికులు ఉన్నారని, వీరి సమస్యలు పరిష్కరించాలంటే ధర్మవరంలోనే లేబర్ ఆఫీస్ పెట్టాలని, కార్మికులందరికీ ప్రభుత్వం ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ధర్మారం ఆర్డీవోకి వినతిపత్రం ఇచ్చినా ఫలితం లేదని వాపోయారు.



డిఆర్ఒ కొండయ్యకు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

కార్యక్రమంలో సిఐటియు నాయకులు మండల కమిటీ కన్వీనర్ జెవి.రమణ, కోకన్వీనర్ అయూబ్‌ఖాన్, గంగాధర్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఇటీవల స్థానిక సంత మార్కెట్ రోడ్డులో ఓ కారు ఢీకొనడంతో మృతి చెందిన వృద్ధురాలు లక్ష్మమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాలు ధర్నా చేపట్టాయి. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ 3 రోజుల క్రితం దళిత మహిళను కారు ఢీకొనడంతో ఆమె మృతి చెందిందని, ఈ సంఘటనపై పోలీసు, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దళితులను అవమాన పరచడమే అన్నారు. దీనికి తోడు మధ్యవర్తులతో పంచాయితీ చేసి బాధిత కుటుంబ సభ్యులను మోసం చేశారన్నారు. ఆ ప్రమాదంపై సమగ్ర విచారణ చేసి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, ప్రమాదానికి కారణమైన వారిని అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ డిప్యూటీ తహశీల్దార్ గౌరీ శంకర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఇదిలా ఉండగా సోమవారం మధ్యాహ్నం 12 గంటలైనా 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అధికారులెవరూ అందుబాటులో లేకపోవడంతో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, కెవిపిఎస్ మండల కార్యదర్శి వెంకటేశులు, మండల కమిటీ సభ్యులు గోవిందప్ప, రాఘవేంద్ర, ఆంజనేయులు, సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహశీల్దార్ గౌరీశంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నిడిమామిడి భూమిని పేదలకు పంపిణీ చేయాలి

రెవెన్యూ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి-బత్తలపల్లి

నిడిమామిడి భూముల్లో గుడిసెలు వేసుకున్న వారందరికీ నివేశ స్థలాలు ఇచ్చేంత వరకూ పోరాడుతామని ధర్మవరం నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి ముసుగు మధు తెలిపారు. నిడిమామిడి ట్రస్ట్ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలు సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. మధు మాట్లాడుతూ 401 సర్వే నెంబర్లో ఉన్న 19.84 ఎకరాల భూమి నిడిమామిడి ట్రస్ట్‌కు సంబంధించినదిగా 2023లో ప్రభుత్వ రికార్డుల్లో, ఆన్‌లైన్‌లో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు ప్రకటించారన్నారు. 2024లో అదే భూమిని పిత్ర ఆర్జితంగా సంక్రమించినట్లు ధర్మవరం మాజీ ఎమ్మెల్యే అనుచ రులు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుని క్రయవిక్రయాలు సాగించారన్నారు. దీనిపై అధికారులు సమాధానం చెప్పాలని లేనిచో తహశీల్దార్, ఆర్డీవో కార్యాలయాలతో పాటు కలెక్టరేట్, జాతీయ రహదారులను దిబ్బంధించి ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీనిపై ఇన్‌ఛార్జి తహశీల్దార్ శారద మాట్లాడుతూ క్రయ విక్రయాలు సాగించి ఆన్‌లైన్‌లో మ్యుటేషన్ చేసుకున్న వాటిపై విచారణ చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వారు తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్, వ్యకాసం జిల్లా నాయకుడు మాల్యవంతం కుళ్లాయప్ప, ధర్మవరం పట్టణ కార్యదర్శి రవికుమార్, సహాయ కార్యదర్శి రమణ, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షులు వెంకటస్వామి, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజా, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ హర్షణీయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం ఎమ్మార్పీఎస్ ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులు మధు మాదిగ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కెబి.మధు హాజరవగా శాలువాలు, పూలమాలలతో స్వాగతం పలికారు. ముందుగా వారు అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూల మాలలు వేసి కేకే కట్ చేసి బాణసంచా పేల్చి సంబ రాలు జరుపుకొన్నారు. ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ 30 ఏళ్ల ఉద్యమానికి లభించిన ప్రతిఫలం వర్గీకరణ అన్నారు. మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు గతంలోనే వర్గీకరణ కు మద్దతు ఇచ్చారని, సుప్రీం కోర్టు తీర్పుతో వర్గీకరణ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందుతాయన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, మనోహర్, రవికుమార్, మల్లికార్జున, జిల్లా గౌరవాధ్యక్షులు ఎన్ఆర్.నరసింహులు, కన్నెరప్ప, అశ్వత్థనారాయణ, మంజునాథ్, మధుడి భీమప్ప, గంగాధర్, నరసింపప్ప, మారెప్ప, లక్ష్మీనారాయణ, తిప్పన్న, అనిల్, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల

రాష్ట్రస్థాయి ర్యాంకర్లకు ఎమ్మెల్యే అభినందనలు

మడకశిర : రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన పట్టణంలోని సర్వోదయ జూనియర్ కళాశాల విద్యార్థులను సోమవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అభినం దించారు. విద్యార్థుల స్వాగత కార్యక్రమానికి వారు హాజరై రాష్ట్ర స్థాయి ర్యాంక్ వచ్చిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆదినారాయణ, శ్రద్ధా స్కూల్ ఛైర్మన్ లాయర్ రాధాకృష్ణ, పట్టణ కన్వీనర్ మనోహర్, భక్తర్‌సాబ్, కిషోర్, కీర్తి, కృష్ణ పాల్గొన్నారు.




ఎంపిడిఓ వాసుదేవ గుప్తాకు వినతి పత్రం అందజేస్తున్న వ్యకాసం నాయకులు

'ఉపాధి' కూలీలకు బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని ఉపాధి హామీ కూలీలకు వెంటనే కూలి డబ్బులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు పిరంగి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఎంపిడిఓ వాసుదేవ గుప్తాకు వినతి పత్రం అందజేశారు. ఉపాధి కూలీలు మాట్లాడుతూ సుమారు 4 నెలలు నుంచి కూలి డబ్బులు అందక కుటుంబ పోషణ భారమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలా మంది కూలీలు దినసరి కూలీలుగా వేరే పనులకు వెళ్తున్నారన్నారు. దీనిపై ఎంపిడిఓ మాట్లాడుతూ మీ వినతిని ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో కూలీలు ప్రేమక్క, చంద్రకళ, నరసింహప్ప, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలతో కరాటే విద్యార్థులు

జాతీయస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కదిరి టౌన్ : బెంగళూరులో జరిగిన నేషనల్ కరాటే ఓపెన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో కదిరి విద్యార్థులు సత్తా చాటారు. కరాటే కతాస్ ఎల్లో బెల్ట్ బాలికల విభాగంలో హానిక, భవ్య, ఫైజా, ఆయేషా, జైనబ్‌అన్సారి గోల్డ్ మెడల్, హాజీరబాను సిల్వర్ మెడల్ సాధించారు. బాలుర కలర్స్ బెల్ట్స్ విభాగంలో అసద్, బాకర్, సనత్ గోల్డ్ మెడల్, జునైద్ సిల్వర్ మెడల్ సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు టోర్నమెంట్ ఆర్గనైజర్ మునీర్‌బాషా ధ్రువీకరణ పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కియో జపాన్ షాడోఖాన్ జిల్లా ప్రెసిడెంట్ మాస్టర్ అక్బర్ అలీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, ముఖ్యంగా మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందాలన్నారు.

హంద్రీనీవా కాలువ గట్టుపై మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

జిల్లావ్యాప్తంగా హంద్రీనీవా కాలువ గట్టుపై మొక్కలు నాటించాలని కోరుతూ సోమవారం పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్‌నాయుడు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావున హంద్రీనీవా కాలువ గట్టుపై వీలైనన్ని పండ్ల మొక్కలు నాటిస్తే జంతువులు, పక్షులకు ఆహారం అందించిన వారమవుతామన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజలతో పాటు స్వచ్ఛంద సంస్థలకు భాగస్వామ్యం కల్పించాలని డిఆర్ఒను కోరామన్నారు. విద్యార్థులతో విరివిగా మొక్కలు నాటిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రకృతి సంరక్షణ నాయకులు దివాకర్, సుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థికి క్రమశిక్షణ అవసరం

పెనుకొండ టౌన్ : విద్యార్థికి క్రమశిక్షణ ఓ ఆయుధం అని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఎం.రాధాకృష్ణారావు తెలిపారు. పట్టణంలోని శాంతినికేతన్ పాఠశాలలో సోమవారం కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానసిక బత్తిళ్లను దరి చేరనీయక ప్రశాంతంగా ఉండడం, ప్రణాళికాబద్ధంగా చదవడం, ఆశించిన స్థాయిలో సత్ఫలితాలు పొందడం, విద్యార్థుల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకొని బోధనా విధానాలపై వివరించారు. తరగతి గదులు తరగని గనులని అభివర్ణించారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని తారకరామాపురం కాలనీకి చెందిన మాదాపురం మహేశ్ ఆదివారం రైలు కింద పడి మృతిచెందిన విషయం తెలుసుకున్న టిడిపి పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం గౌడ్, 40వ వార్డు ఇన్‌ఛార్జి అశోక్ సోమవారం వారి ఇంటికి వెళ్లి అతడి తల్లి రాజేశ్వరిని పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు.



మృతుని కుటుంబాన్ని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

విద్యాసామగ్రి అందజేత

బుక్కపట్నం : మండలంలోని నార్సింపల్లి, తండా పాఠశాల విద్యార్థలకు సోమవారం పుట్టపర్తికి చెందిన బిల్డర్ నారాయణప్ప కుటుంబ సభ్యులు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. అమెరికాలో స్థిరపడిన మహేష్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాల, పెన్నులు, వాష్‌రూమ్ కిట్స్, తదితర సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రమీలమ్మ, ఉపాధ్యాయులు సుధాకర్, సత్యనారాయణరెడ్డి, చంద్రశేఖర్, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై ఎపిటిఎఫ్ హర్షం

పుట్టపర్తి రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్ ఫొటోలు తీసే బాధ్యతల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి లభించినట్లు ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరు శ్రీనివాసులు, చంద్ర తెలిపారు. గతంలో రోజూ టాయిలెట్లు పరిశుభ్రంగా ఉన్నాయా లేదా అని ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉండేదని, ప్రస్తుత ప్రభుత్వం ఆ బాధ్యతల నుంచి విముక్తి కల్పించడం హర్షణీయమన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించండి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని ప్రభాత్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని వెంగళమ్మ చెరువు ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ఆయన సత్యసాయి విదేశీ భక్తుల సహకారంతో విద్యార్థుల చేత పలు రకాల పండ్లు, పూల మొక్కలు నాటించారు. నాటిన మొక్కలను విద్యార్థులు సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, సత్యసాయి భక్తులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు రక్ష

తలుపుల : తల్లిపాలే బిడ్డకు రక్ష అని ఐసిడిఎస్ సూపర్వైజర్ దీప తెలిపారు. తల్లిపాల వారోత్స వాల్లో భాగంగా సోమవారం తలుపుల-1,7 అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్వైజర్ దీప తల్లిపాల విశిష్టత, ప్రయోజనాలను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. చిన్నారులకు విధిగా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సునీత, లలిత, పుణ్యవతి, మునెమ్మ, జి.రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఎర్రమట్టి రవాణా

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల కేంద్రమైన నంబులపూలకుంటకు సమీపంలోని కొండలు, గుట్టల్లో ఎక్కువ ప్రాంతాన్ని ఇప్పటికే సోలార్ పవర్ ప్రాజెక్టుకు తీసుకున్నారు. మిగిలిన నడింబోటు, బోటు కొండ పచ్చదనం పరచుకుని ఆహ్లాదకరంగా కనిపిస్తాయి. మట్టి మాఫియా దెబ్బకు ఈ కొండలు కూడా క్రమ క్రమంగా కరిగిపోతున్నాయి. ట్రాక్టర్ ఎర్రమట్టికి రూ. 1500 నుంచి రూ. 2వేలు వసూలు చేస్తూ జేబులు నింపుకొంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా మట్టి తరలిస్తున్నా అధికారులెవరూ ఇటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మట్టి మాఫియాను అడ్డుకోవాలని పర్యావరణ ప్రేమికులు, మండల ప్రజలు కోరుతున్నారు.



కొండలో మట్టి తవ్వుతున్న జెసిబి

పరిటాల శ్రీరాములు డిగ్రీ కళాశాలకు న్యాక్ బి ప్లస్ గ్రేడ్

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్(ఎన్ఎఎసి) బి ప్లస్ గ్రేడ్ దక్కినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జెవిఎస్ కేశవరావు సోమవారం తెలిపారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ గత నెల 23, 24 తేదీల్లో నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడియేషన్ కమిటీ బృందం కళాశాలను సందర్శించి మౌలిక సదుపాయాలను పరిశీలించి బి ప్లస్ గ్రేడ్ ఇచ్చారన్నారు. కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్స్ పంచిపెట్టారు. ఈ గ్రేడింగ్ విధానం వల్ల కళాశాలకు యుజిసి నుంచి నిధులు రావడానికి ఆస్కారం ఉందన్నారు. కార్యక్రమంలో ఐసిఐక్యూ కోఆర్డినేటర్ యశోదరాణి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జయప్ప, అధ్యాపకులు డాక్టర్ హరీష్‌బాబు, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ప్రతాప్, రామన్న, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



పరిటాల శ్రీరాములు డిగ్రీ కళాశాల

సమస్యల పరిష్కారం కోసమే 'ప్రజాదర్బార్' : ఎమ్మెల్యే

కదిరి టౌన్ : నియోజకవర్గ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని రోడ్లు భవనాల అతిథి గృహంలో సోమవారం ఎమ్మెల్యే ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. అలాగే రూరల్ మండల నాయకులతో సమీక్ష నిర్వహించి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకొన్నారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్ మండల కన్వీనర్ చెన్నకేశవులు, కూటమి సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.




ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

తప్పుడు ప్రచారం చేస్తే చట్టప్రకారం చర్యలు

నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్

ప్రజాశక్తి-పెనుకొండ

నగర పంచాయతీ ప్రతిష్ఠతను దెబ్బతీసేలా, నాపై తప్పు డు ఆరోపణలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటా మని నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ స్పష్టం చేశారు. నగర పంచా యతీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలోని కోనాపురం, కొండాపురం, మంగాపు రం వెళ్లే రహదారిపై కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరించి ఆరోపణలు చేయడం తగదన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఆ భూమిని ప్రయి వేటు వ్యక్తులకు చెందిందని ధ్రువీకరించారన్నారు. అలాగే కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి ఆ భూమికి సంబంధించిన అన్ని పత్రాలు తమకు ఇచ్చారని తెలిపారు. ప్రజలకు అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గం లేకపోతే ప్రభుత్వం భూమిని కొనుగోలు చేసి దారి వేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఆధారాలు లేకుండా దుష్ప్రచారం చేస్తే పరువు నష్టం దావా వేస్తానని ఆయన హెచ్చరించారు.



కోర్టు ఉత్తర్వులు చూపుతున్న కమిషనర్ వంశీకృష్ణభార్గవ్

జనసేనాని అడుగుజాడల్లో ముందుకెళ్తాం

ధర్మవరం టౌన్ : జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో ముందుకెళ్తామని జనసేన పార్టీ సీనియర్ నాయకులు చిలకం వెంకటరెడ్డి పేర్కొన్నారు. జన సైనికులు, పట్టణ, నియోజకవర్గ, రాష్ట్ర ప్రజలు పుర ప్రముఖులు ప్రతి ఒక్కరూ జనసేన పార్టీ సభ్యత్వం స్వీకరించాలని కోరారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా రేగాటిపల్లికి చెందిన చిలకం వెంకటరెడ్డి 1000 సభ్యత్వాలు పూర్తి చేయడం అభినందనీయమన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

ధర్మవరం టౌన్ : మండలంలోని రేగాటిపల్లి పంచాయతీలో సోమవారం జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదనరెడ్డి సతీమణి చిలకం ఛాయాదేవి ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు కూలీల కుటుంబానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మవరంలో చోరీ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని లక్ష్మీనగర్‌లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. లక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్న టీచర్ బాలాజీ కుటుంబ సభ్యులతో కలిసి హుబ్లీ వెళ్లాడు. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించి బీరువా తలుపులు పగలకొట్టి రూ. 22వేలు నగదు ఎత్తుకెళ్లారు. చుట్టు పక్కల వారు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అలాగే ఇంటి యజమానులకు సమాచారం విషయాన్ని తెలిపారు.